క్లుప్తంగా

భూసార పరీక్షలపై విద్యార్థులకు అవగాహన



మట్టి నమూనా సేకరిస్తున్న విద్యార్థులు

ఖమ్మంరూరల్: మండలంలోని పోలేపల్లిలో కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులకు భూసార పరీక్షలపై వ్యవసాయశాఖ అధికారులు శనివారం అవగాహన కల్పించారు. మట్టి నమూనా సేకరణ, భూసార పరీక్ష ఫలితాలు వివరించారు. పంటలకు ఏ సమయంలో ఏమందులు, ఎరువులు ఏ మోతాదులో వాడాలో ఈ భూసార పరీక్షల ద్వారా తెలుస్తుందని తద్వారా రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయన్నారు. ఈ కార్యక్రమంలో భూసార పరీక్ష కేంద్రం అధికారి బాలప్రకాష్, ఏఓ కె.ఉమానగేష్, పాఠశాల ప్రిన్సిపాల్ కవీంద్ర రాయ్ తదితరులు పాల్గొన్నారు.

టీజేఎస్ సభ్యత్వాలు ప్రారంభం

రఘునాథపాలెం: మండలంలోని కోయచలకలో టీజేఎస్ సభ్యత్వాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కన్వీనర్ వి.బాబు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతం చేయడంతో రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నేరవేరతాయన్నారు. ఈ కార్యక్రమంలో జంగిపల్లి రవి, నరసింహారావు, నాగేశ్వరరావు, రాగం పాపారావు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి



నివాళులర్పిస్తున్న దృశ్యం

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ ఉద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ కీలక పాత్ర వహించారని వీరనారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్యా ఉపేంద్రబాయి అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా శనివారం సంఘం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోతు భద్రూనాయక్, ఝాన్సీ, రంగిశెట్టి శ్రీలత, భవాని, జ్యోతి ఉన్నారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

నేలకొండపల్లి: ఎండిపోతున్న వరిపొలాల రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని సీపీఎం ఆధ్వర్యంలో ఇరిగేషన్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఇరిగేషన్ ఏఈ నరేష్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి కె.వీ.రెడ్డి మాట్లాడుతూ... ఎకరానికి రూ.25 వేలు, వరదలతో మేటలు వేసిన భూములకు ఎకరానికి రూ.50 వేలు పరిహారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రచ్చా నరసింహారావు, ఏటుకూరి రామారావు, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, అప్పారావు, యలమద్ధి లెనిన్, మందడపు మురళీ కృష్ణ, తిరపతి రావు, మల్లేశ్వరరావు, భాస్కర్‌రావు, సామాల మల్లిఖార్జున్‌రావు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సరిపోదా శనివారం
వినోద	ద గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైం
సాయిరాం	100 క్రోర్స్, హైడ్ ఎన్ సీక్
ఆదిత్య	చిక్లెట్స్
శ్రీనివాస	మత్తు వదలరా 2

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	50	బచ్చలికూర	3
వంకాయ	48		20
బెండకాయ	36	పాలకూర	3
పచ్చిమిర్చి	28		20
కాకర	48	చుక్కకూర	3
బోడ కాకర	120		20
బీర	48	తోటకూర	3
దొండ	48		20
పొట్లకాయ	48	గోంగూర	5
చిక్కుడు	110		20
గోరుచిక్కుడు	48	మెంతికూర	2
క్యాబేజీ	24		20
క్యాలీఫ్లవర్	35	కొత్తిమీర	1
ఆలుగడ్డ	40		50
చామగడ్డ	46	పుదీన	1
క్యారెట్	54		25
బీన్స్	70	-ఖమ్మం వ్యవసాయం	

నీటి మూటలుగానే సంఘాలు..

సాగునీటి సంఘాల ఎన్నికల కోసం ఎదురుచూపులు

- సంఘాలతో చెరువుల బలోపేతం
- 2008లో చివరిసారిగా ఎన్నికలు
- కాంగ్రెస్ హయాంలో ఎన్నికల నిర్వహణపై చిగురిస్తున్న ఆశలు
- గతంలో పాలేరులో 25 సంఘాలు



నేలకొండపల్లి ఇరిగేషన్ సబ్ డివిజన్ కార్యాలయం

నేలకొండపల్లి: చెరువులు, కుంటల అభివృద్ధికి ఎంతో దోహదపడే సాగునీటి సంఘాలకు చాలా కాలంగా ఎన్నికలు నిర్వహించలేదు. 2008లో చివరిసారిగా సాగునీటి వినియోగదారుల సంఘానికి ఎన్నికలు జరిగాయి. 2014లో తెలంగాణ ఏర్పాటయ్యాక అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహిస్తుందని రైతులు భావించారు. కానీ వాటి జోలికి వెళ్లని ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం కింద చేపట్టిన పనులు కాంట్రాక్టర్లకు అప్పగించింది.

1997లో మొదలై.. 2008లో ఆగి..

నీటి పారుదల రంగంలో రైతుల భాగస్వామ్యం పెంచేందుకు 1997లో టీడీపీ ప్రభుత్వం సాగునీటి సంఘాలు ఏర్పాటు చేసింది. ఆరేళ్లకు ఒకసారి ఎన్నికలు నిర్వహించి సంఘాల ద్వారానే చెరువుల అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించింది. 2004లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పాత విధానాలలో మార్పులు చేసింది. ప్రతీ రెండేళ్లకు ఒకసారి 1బై 3 వంతు పాలకవర్గ సభ్యులకు ఎన్నికలు నిర్వహించి రెండేళ్ల పదవీ కాలం ముగిసే సభ్యులను మాజీలను చేయాలని నిర్ణయించింది. ఈ ప్రకారం 2006 , 2008 సంవత్సరంలో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. 2010 జనవరిలో 1 బై 3 వంతు పద్ధతిలో జరగాల్సిన ఎన్నిక వాయిదా పడింది. తెలంగాణ ఉద్యమం, రాజకీయ పరిస్థితులు దృష్ట్యా నిర్వహణకు ప్రభుత్వం సుముఖత చూపలేదు. 2011 జనవరిలోనైనా నిర్వహిస్తుందని రైతులు ఆశతో ఎదురుచూడుగా సంఘాల ఎన్నికలు వాయిదా వేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి నుంచి సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలే లేకుండాపోయాయి. కాంగ్రెస్ అధికారంలోకి రావటంతో మళ్లీ సాగునీటి సంఘాల ఎన్నికలపై ఆశలు చిగురిస్తున్నాయి.

పాలేరులో 25 సంఘాలు..

పాలేరు నియోజకవర్గంలో మొత్తం 25 సాగునీటి వినియోగదారుల సంఘాలను గతంలో ఏర్పాటు చేసింది. నేలకొండపల్లి సబ్ డివిజన్ పరిధిలోని కూసుమంచి, నేలకొండపల్లి మండలాలలో మొత్తం 9 నీటి వినియోగదారుల సంఘాలు, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ మండలాల పరిధిలో 16 నీటి వినియోగదారుల సంఘాలు ఉన్నాయి. గతంలో కాల్వల మరమ్మతులు, చెరువు, కుంటల అభివృద్ధి పనులు కమిటీ దగ్గర ఉండి చేయించారు. ఇందు కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించింది. తాజాగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత సాగునీటి సంఘాల ఎన్నికలు తెరపైకి వచ్చింది. దీంతో గ్రామాలలో సాగు ఎన్నికలపై చర్చ జోరుగా సాగుతుంది.

ప్రభుత్వం దృష్టి సారించాలి..



సాగునీటి సంఘాలు ఉంటేనే చెరువులకు రక్షణ. చెరువులు, కాల్వలు మరమ్మతులకు పనులు చేపట్టేవాళ్లం. పదేళ్లగా సంఘాలకు ఎన్నికలు లేకుండాపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వమైనా సంఘాలకు ఎన్నికలు నిర్వహించి చెరువులు బలోపేతానికి చర్యలు తీసుకోవాలి.

– కడారు వెంకటేశ్వరరావు, సాగు నీటి సంఘం మాజీ చైర్మన్, నేలకొండపల్లి

సంఘాలతో అభివృద్ధి



నీటి వినియోగదారుల సంఘాలు ఉంటే ప్రపంచ బ్యాంక్ నుంచి నిధులు వస్తాయన్నారు. దీని వలన అభివృద్ధి చేసుకోవచ్చు. అంతే కాకుండా రైతుల పర్యవేక్షణ నిరంతరం ఉంటుంది. విపత్తుల పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పిస్తారు.

– తీగ రమణయ్య, నీటి సంఘం మాజీ డైరెక్టర్, రాయగూడెం

ఆక్రమణకు అడ్డుకట్ట..



సంఘాల ఏర్పాటుతో చెరువులు, కాలువలు ఆక్రమణ కాకుండా చూసుకునే బాధ్యత కమిటీలకు ఉంటుంది. వాటికి పూర్తి రక్షణ కల్పించే అవకాశం కలుగుతుంది. ప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికలపై మంచి నిర్ణయం తీసుకోవాలి.

– రావెళ్ల కృష్ణారావు, మోటాపురం సొసైటీ మాజీ డైరెక్టర్

వరద బాధితులకు చేయూత



తిరుమలాయపాలెం: గ్యాస్ స్టౌలు, మంచాలు అందజేస్తున్న సంస్థ సభ్యులు



ఖమ్మంస్పోర్ట్స్: నోట్‌బుక్స్ పంపిణీ..

తిరుమలాయపాలెం: వరదలతో సర్వం కోల్పోయిన రాకాసితండా వాసులను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి చేయూతనందించాయి. శనివారం ప్యూర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 76 మందికి గ్యాస్‌స్టౌలు, ఇనుప మంచాలు పంపిణీ చేశారు. సంస్థ డైరెక్టర్ అరుణ, ఫౌండర్ తుల్లూరి శైలు, కార్తీక్, రాజు, అన్వర్, కొమ్ము శ్రీను, తుల్లూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ హరి ప్రసాదరావు రాకాసి తండా వరద బాధితులకు నిత్యావసర సరకులు, దుప్పట్లు, పౌష్టికాహార పదార్థాలు, చాపలు తదితర వస్తువులతో ఉన్న కిట్లను పంపిణీ చేశారు. సంస్థ బాధ్యులు తిరుపతి రావు, శ్రీనివాస్,రాజేష్, రాందాస్, రవీంద్ర, కుటుంబరావు, భాస్కర్ ఉన్నారు.

ఖమ్మంరూరల్: మండలంలోని రాజీవ్‌గృహకల్ప వరద బాధితులకు గూంజ్ సంస్థ సహకారంతో ఎయిడ్ సంస్థ ఆధ్వర్యంలో నిత్యావసరాలు, దుప్పట్లు, పౌష్టికాహార పదార్థాలు పంపిణీ చేశారు. సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్. హరిప్రసాద్‌రావు, తిరుపతిరావు, కె. శ్రీనివాస్, రాజేష్, రాందాస్, రవీంద్ర, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రాజీవ్‌గృహకల్పలో మాస్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో సామాజిక సేవకురాలు, కళాకారిణి పత్తిపాటి లక్ష్మికాంతమ్మ సరుకులు పంపిణీ చేశారు.



సరుకులు పంపిణీ చేస్తున్న లక్ష్మీకాంతమ్మ

పిల్లలకు పుస్తకాల పంపిణీ..

ఖమ్మంస్పోర్ట్స్: ధంసలాపురం, సీతారాంపురం కాలనీలోని పిల్లలకు కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. కరస్పాండెంట్ కోట అప్పిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి రమణ, అధ్యాపకులు రాజశేఖర్, వంశీప్రియ, లక్ష్మణరావు, ప్రియంవదా, ఉషారాణి పాల్గొన్నారు.

ఖమ్మం సహకారనగర్: మాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్లు సామాజిక సేవకురాలు పత్తిపాటి లక్ష్మీకాంతమ్మ తెలిపారు. బియ్యం, వంట నూనె, కందిపప్పు తదితర నిత్యావసర సరుకులు అందించామన్నారు. గద్దల రత్నమ్మ, మహాలక్ష్మీ, విజయ లక్ష్మీ, రమణ, సునీత, హైమావతి, కళావతి, నాగమణి, స్వరూప, రమాదేవి పాల్గొన్నారు.

ప్రకాష్‌నగర్ బ్రిడ్జిపై వాహనాలకు అనుమతివ్వాలి



ధర్నా చేస్తున్న వాహనదారులు

ఖమ్మంరూరల్: ఖమ్మం ప్రకాష్‌నగర్ బ్రిడ్జిపై నుంచి వాహనాల రాకపోకలకు అనుమతివ్వాలని కోరుతూ వాహనదారులు శనివారం బ్రిడ్జి వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వరదలు వచ్చి 20 రోజులు గడుస్తున్నా మరమ్మతులు ప్రారంభించలేదని, వెంటనే బ్రిడ్జిపై నిర్మించిన గోడలు తొలగించాలని తెలిపారు. ఇక్కడి నుండి రాకపోకలు నిషేధించడంతో కోదాడ క్రాస్‌రోడ్, గుర్రాలపాడు మీదుగా తిరిగి రావాల్సి వస్తోందని పేర్కొన్నారు.

పౌష్టికాహారం తప్పక తీసుకోవాలి



రఘునాథపాలెం: సామూహిక సీమంతాలు..

రఘునాథపాలెం: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని తీసుకోవాలని తహసీల్దార్ లూథర్ విల్సన్, ఐసీడీఎస్ సీడీపీఓ వీరభద్రమ్మ సూచించారు. రఘునాథపాలెం రైతు వేదికలో పోషణ మాసోత్సవాల సందర్భంగా సామూహిక సీమంతాలు, అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఉద్యోగులు వెంకటమ్మ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: మండలంలోని తాళ్లచెరువులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సామూహిక అన్నప్రాసన, అక్షరాభ్యాసం, సీమంతాలు నిర్వహించారు. సీడీపీఓ సరస్వతి పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఏసీడీపీఓ ఉదయశ్రీ సూపర్‌వైజర్ సావిత్రి అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



తిరుమలాయపాలెం: అక్షరాభ్యాసం..

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని 33/11 కేవీ బుర్హాన్‌పురం సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ బస్టాండ్ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్ 2 ఏఈ ఆపరేషన్స్ నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో పాత బస్టాండ్, బస్ డిపో, సాయిబాబా రోడ్లు, మామిళ్లగూడెం, మీ సేవా ఆఫీస్ ఏరియా, ఆర్డీఓ ఆఫీస్ ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు. అదేవిధంగా ప్రభుత్వ ప్రధానాస్పత్రి సబ్ స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్–3 ఏఈ బి.తావుర్యా తెలిపారు. దీంతో సహకారనగర్, గట్టయ్య సెంటర్, వైరారోడ్, జమ్మిబండ, వీడీవోస్ కాలనీ, బోడేపూడి స్థూపం, మున్సిపల్ ఆఫీస్ ఏరియా, రిక్కాబజార్, ప్రభుతాస్పత్రి ఏరియా, జెడ్పీ సెంటర్‌లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి



మాట్లాడుతున్న శ్రీకాంత్

రఘునాథపాలెం: ఎలాంటి షరతులు లేకుండా ప్రతీ రైతుకు రుణమాఫీ చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ అన్నారు. శనివారం జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రేషన్ కార్డు నిబంధనలు తొలగించి, పహణీ నకల్ మీద రుణం తీసుకున్న రుణాలు మాఫీ చేయాలన్నారు. రైతు రుణమాఫీ చేస్తామని వాగ్దానం చేసి ఆచరణలో అనేక కొర్రీలు పెట్టి రైతు రుణమాఫీ 40 శాతం కూడా పూర్తి చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు నందిపాటి మనోహర్, మండల కార్యదర్శి ఎస్.నవీన్ రెడ్డి, రహిమ ఖాన్, వల్లూరి శ్రీనువాస్, తిరుపయ్య, కుమార్, ఇమాం, రహీం, హరి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చోరీకి యత్నం

కామేపల్లి: మండలంలోని తాళ్లగూడెంలో దుండగులు చోరీకి యత్నించగా స్థానికుల అప్రమత్తతతో పారిపోయారు. గ్రామానికి చెందిన ఫాతిమా కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం రాత్రి ఇంట్లో నిద్రించగా, గుర్తు తెలియని వ్యక్తులు గడ్డపారతో కిటికీ తలుపు పగలకొట్టేందుకు యత్నించారు. ఈ క్రమంలో ఫాతిమాకు మెలకువ వచ్చి కేకలు వేయగా దొంగలు పారిపోయారు. కాగా, గ్రామంలో నెల వ్యవధిలోనే మూడు చోరీలు జరిగాయని, ఇప్పటికైనా పోలీసులు పెట్రోలింగ్ పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

సమన్వయంతో పనులు పూర్తి చేయాలి



అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: నిర్దేశించిన సమయంలో అధికారులు, కాంట్రాక్టర్ సమన్వయంతో యూపీహెచ్‌సీ సెంటర్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. నగరంలోని ట్రంక్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న యూపీహెచ్‌సీ సెంటర్‌ను శనివారం సందర్శించారు. అదేవిధంగా బల్లెపల్లిలో ఉన్నటువంటి డీఆర్‌సీసీను పరిశీలించారు. డీఆర్‌సీసీలో చెత్త సేకరణ, ప్రాసెసింగ్ తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రతీరోజు ట్రాక్టర్లు ఆటోలు ఎన్ని వస్తున్నాయో, ప్లాస్టిక్, కార్డ్‌బోర్డ్స్, పేపర్ ఎంత సేకరిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంట అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ కార్పొరేషన్ రుణాలను మంజూరుచేయాలి



మాట్లాడుతున్న అజ్మీరా రామ్మూర్తి

ఖమ్మం మామిళ్లగూడెం: పెండింగ్‌లో ఉన్న ఎస్టీ కార్పొరేషన్ రుణాలను తక్షణమే మంజూరు చేయాలని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీరా రామ్మూర్తి డిమాండ్ చేశారు. శనివారం జిల్లా సమితి సమావేశం భరత్ అధ్యక్షతన ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశ వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ఖర్చు చేయాలని ఇతర రంగాలకు కేటాయించడం సరికాదన్నారు. సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమీషన్ చైర్మన్ ఎండి మౌలానా మాట్లాడుతూ... దేశంలో ఒక మూల గిరిజనులపై ఇంకా దాడులు జరుగుతునే ఉన్నాయని ఆరోపించారు. ఈ సమావేశంలో నాయకులు పి.శ్రీను, శ్రీనివాస్, బి.రాంబాబు, జగన్, రవీందర్, శేఖర్, నాగరాజు, దేవా, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఫీజులు, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న రామకృష్ణ

ఖమ్మంమయూరిసెంటర్: బోధన ఫీజులతో పాటు ఉపకార వేతనాల బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ బిల్లులు అందక కళాశాలల్లో చదువు పూర్తి చేసిన వారికి యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు గుగులోత్ వంశీ, రాకేష్, ప్రతాప్, గణేష్, సునీల్, సాబీర్, రవికుమార్, రోహిత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన



ఖమ్మరూరల్: మాట్లాడుతున్న శ్యాంసన్



నేలకొండపల్లి: బెల్ట్, టైలు అందజేస్తున్న ఎంపీడీఓ యర్రయ్య

ఖమ్మంరూరల్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందిస్తున్నట్లు జలగం నగరర్ ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం శ్యాంసన్ తెలిపారు. శనివారం పాఠశాలలో జరిగిన తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా.. విద్యార్థులు నృత్యాలు చేయగా తల్లులు బతుకమ్మ పాటలు పాడి ఆడారు. 8, 9 విద్యార్థులకు కరాటే పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు ఆదిలక్ష్మి, రూబీ, కృష్ణ, షాజిదాబేగం, పుల్లయ్య పాల్గొన్నారు.

నేలకొండపల్లి: విద్యతోనే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని ఎంపీడీఓ యం.యర్రయ్య సూచించారు. మండలంలోని మంగాపురంతండాలో శనివారం జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో పాఠశాల అభివృద్ధికి తీసుకోవాల్సిన అంశాలపై చర్చించి ఏకగ్రీవ తీర్మానం చేశారు. అనంతరం విద్యార్థులకు టై, బెల్ట్‌లు అందించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు ఆటల, పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. మండల పంచాయతీ అధికారి శివ, పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణ, హెచ్‌ఎం ఎస్.ఆనంద్, వెంగళరావు, ఉపేందర్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై అభ్యంతరం



వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కామేపల్లి: మండలంలోని ముచ్చర్ల పంచాయతీలోని ఓటర్ల జాబితాపై అభ్యంతరం తెలుపుతూ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి ఫిర్యాదు అందజేశారు. శనివారం స్థానిక ఎంపీడీఓ రవీందర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఒక వార్డులో నివాసం ఉంటున్న ఓటరు పేరు మరో వార్డులో నమోదు అయిందని, మరో మండలానికి చెందిన కొంతమంది స్థానిక నివాసులు కానప్పటికీ ఓటరుగా నమోదు చేసుకున్నారన్నారు. ఓటరు జాబితాను మరోసారి పూర్తి స్థాయిలో పరిశీలించి అనర్హులైన ఓటర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య, గాదె రాంబాబు, సిరిపురపు రవి, దాసరి శ్రీను, కోలా వెంకటేశ్వర్లు, ఎస్‌కే.దస్తగిరి, కనకపూడి వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువాలు వితరణ

కూసుమంచి: కూసుమంచి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసి పదవీ విరమణ పొందిన వాచేపల్లి గురువారెడ్డి పాఠశాలకు మూడు బీరువాలను అందజేశారు. శనివారం పాఠశాలలో హెచ్‌ఎం రాయల వీరస్వామికి బీరువాలు అందజేశారు. ఈ సందర్భంగా గురువారెడ్డిని పలువురు అభినందించారు.

సాగర్ కాల్వలను ఆధునీకరించాలి



గండి ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నాయకులు

కూసుమంచి: వర్షాలకు, వరదలకు దెబ్బతిన్న సాగర్ కాల్వలను ఆధునీకరించాలని సీపీఐ అనుబంధ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాగం హేమంతరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పాలేరు వద్ద సాగర్ ఎడమ కాలువ గండి పూడ్చివేత పనులను ఆయన పరిశీలించారు. ప్రభుత్వం గండిని పూడ్చే విషయంలో సరైన రీతిన స్పందించలేదన్నారు. వెంటనే పనులను పూర్తి చేసి కాలువకు నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, గోవిందరావు, నాయకులు జితేందర్‌రెడ్డి, వెంకటరెడ్డి, శివరామకృష్ణ, వెంకటేశ్వర్లు, రామారావు, రవి పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: మండలంలోని కోరట్లగూడెంకు చెందిన వివాహిత ఎం.మాధవి(30) శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ విషయాన్ని గమనించిన కుటుంబీకులను ఆమెను చికిత్స కోసం ఖమ్మం తరలించారు. అయితే, మాధవి ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియరాలేదు.

ఒరిగిన విద్యుత్ స్తంభాలు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని పలు చోట్ల విద్యుత్ స్తంభాలు ఒరిగి ప్రమాదకరంగా మారాయి. చెరువు బజార్, 21వ డివిజన్ అబ్దుల్ కలాం నగర్ రోడ్డు నంబర్ 1లో గత నెలలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. అయితే వీటికి గోతులు లోతుగా తీయకపోవడం, కాంక్రీట్‌తో సరిగా పూడ్చలేదు. దీని వల్ల కాలువ పనులు జరిగినప్పుడు ఆ స్తంభాలు ఒరిగాయి. దీనిని గమనించిన స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో విద్యుత్ సరఫరా కూడా నిలిచిపోయింది. విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ఒరిగిన విద్యుత్ స్తంభం